

చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి. మార్కెట్‌కు 444 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.56

కక్కలపల్లి మండీలో మంగళవారం టమాట కిలో గరిష్ట ధర రూ.56 పలికింది. అలాగే కనిష్టంగా రూ.40, సరాసరిన రూ.47 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.4°/22.3°

జిల్లాలో మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలి వేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

ఖాద్రీశుడి కల్యాణోత్సవానికి పేర్లు నమోదు చేసుకోండి



కదిరి టౌన్: శ్రావణమాసం సందర్భంగా ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిర్వహించే శ్రీవారి ఆర్జిత కల్యాణోత్సవ సేవలో పాల్గొనాలనుకునే వారు పేర్లు నమోదు చేసుకోవాలని ఈఓ వి.శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెలలో 20, 21, 23, 24, 27, 28, 29 తేదీలతో పాటు సెప్టెంబర్‌లో 1, 3, 4, 5, 6, 11, 12వ తేదీల్లో ఉదయం 10.30 గంటల నుంచి శ్రీవారి ఆర్జిత కల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కల్యాణోత్సవ సేవ టికెట్ రూ.4 వేలు కాగా, ఒక్కో టికెట్‌పై ఐదుగురికి ప్రవేశం ఉంటుందన్నారు. ఒక్కోరోజు కేవలం 5 టికెట్లు మాత్రమే జారీ చేస్తామని పేర్కొన్నారు.

వారిపై సస్పెన్షన్, షోకాజ్ ఉపసంహరణ



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

అనంతపురం క్రైం: శింగనమల నియోజకవర్గం మడుగుపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త తలారి బయన్నపై విధించిన సస్పెన్షన్, ఎస్సీ సెల్ నాయకుడు చామలూరు రాజగోపాల్‌కు జారీ చేసిన షోకాజ్ నోటీసును ఉపసంహరించుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం ఆయన అనంతపురంలో మీడియాకు వెల్లడించారు. ఎంపీ తలారి రంగయ్యపై బయన్న, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతిపై చామలూరు రాజగోపాల్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడంతో అధిష్టానం ఆదేశాలతో వారిపై ఇదివరకు క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వారిచ్చిన సంజాయిషీతో అధిష్టానం సంతృప్తి చెందిందన్నారు. ఈ మేరకు ఆ ఇద్దరిపై సస్పెన్షన్, షోకాజ్ నోటీసును ఉపసంహరించుకున్నట్లు వెల్లడించారు.

హత్య కేసులో 15 మంది అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ హమీద్‌ఖాన్

తాడిపత్రి: నందలపాడులో మూడు రోజుల క్రితం జరిగిన ఆకుల సురేంద్ర (25) హత్య కేసులో 15 మంది నిందితులను పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ హమీద్‌ఖాన్ మంగళవారం సాయంత్రం పోలీస్ స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. ఈ నెల 13న రాత్రి పది గంటల సమయంలో సురేంద్ర తన ఇద్దరు స్నేహితులైన పవన్, శివతో కలిసి కుమ్మరివీధిలోకి వెళ్లాడు. మద్యం మత్తులో ఉన్న వీరు అక్కడ అబ్దుల్ అనే వ్యక్తితో అకారణంగా గొడవకు దిగారు. అంతటితో ఆగక ఆ వీధిలోని మహిళలను అసభ్యంగా మాట్లాడుతూ బీభత్సం సృష్టించారు. దీంతో నందలపాడుకు చెందిన చాకలి నరేంద్ర, మద్దిరాల విజయ్ కుమార్, చియ్యేడు శివప్రసాద్, తాషా మాబువలి, చాకలి నాగార్జున, షేక్ ముస్తఫా, చాకలి కమలాకర్, షేక్ అలీ, రజక శివ, తలారి రామపుల్లయ్య, తలారి లక్ష్మీనారాయణ, అకుల సయ్యద్ ఆసిఫ్‌తో పాటు మరో ముగ్గురు తిరగబడ్డారు. కర్రలు తీసుకుని దాడి చేసేందుకు ప్రయత్నించగా గమనించిన ఆకుల సురేంద్ర, పవన్, శివ బైక్‌పై పరారయ్యారు. అయినా వారు వెంబడించి ఆకుల సురేంద్రపై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన సురేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పై 15 మంది నిందితులను మంగళవారం అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. అరెస్టయిన నిందితుల్లో ముగ్గురు మైనర్లు ఉన్నారన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ధర్మవరం అర్బన్: పట్టణంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపిన మేరకు... పట్టణంలోని సిద్దయ్యగుట్టకు చెందిన గుజ్జల పోతలయ్య, అతని తండ్రి వీరప్ప కర్ణాటక రాష్ట్రానికి చెందిన మద్యాన్ని అక్రమంగా తెచ్చి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో మంగళవారం దాడి చేసి పట్టుకున్నారు. వారి నుంచి 30 మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. తండ్రీ కొడుకుపై కేసు నమోదు చేశారు. ఎవరైనా కర్ణాటక మద్యం, గంజాయి అమ్మినా, రవాణా చేసినా, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.



శిరసాని హిల్స్ పోలీసు పరేడ్ మైదానంలో జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో పరేడ్‌ను పరిశీలిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం



పోలీసు జాగిలం నుంచి పుష్పగుచ్ఛం అందుకుంటున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం



సంస్కృతి చాటేలా నృత్య ప్రదర్శన ఇస్తున్న కేజీబీవీ విద్యార్థినులు



దేశభక్తి, స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలు తెలుపుతూ నృత్య ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

అభివృద్ధి పథం.. అగ్రస్థానం



వేడుకకు హాజరైన జిల్లా అధికారులు





జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం, కలెక్టర్ అరుణ్ బాబు, సబ్ కలెక్టర్ కార్తీక్ (ఇన్‌సెట్) మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు

- జిల్లా సమగ్రాభివృద్ధికి చర్యలు
- ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం
- శిరసాని హిల్స్ పరేడ్ మైదానంలో ఘనంగా స్వాతంత్య్ర వేడుకలు
- ఉత్తమ సేవకులకు ప్రశంసా పత్రాలు
- అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు
- ప్రగతికి అద్దం పట్టిన శకటాల ప్రదర్శన
- వివిధ శాఖల ఆధ్వర్యంలో స్టాళ్ల ఏర్పాటు

సాక్షి, పుట్టపర్తి: 'జన రంజక పాలనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో సరికొత్త అధ్యాయం లిఖించారు. స్వచ్ఛమైన, అవినీతి రహిత, వివక్ష లేని, పారదర్శక పాలన అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది. పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా భగవాన్ శ్రీ సత్యసాయి బాబా పేరుమీదుగా పుట్టపర్తి కేంద్రంగా ఏర్పడిన శ్రీసత్యసాయి జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా ఉంచేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం' అని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. మంగళవారం పుట్టపర్తిలోని శిరసాని హిల్స్ పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించిన 77వ స్వాతంత్య్ర వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన.. చేస్తోన్న సంక్షేమ పథకాల గురించి మంత్రి జయరాం వివరించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, శకటాల ప్రదర్శన ఆకట్టుకున్నాయి. ఉత్తమ సేవలందించిన పలువురికి ప్రశంసా పత్రాలు అందజేశారు. వేడుకల్లో ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు శంకరనారాయణ, తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, కలెక్టర్ పి.అరుణ్‌బాబు, సబ్ కలెక్టర్ కార్తీక్, జిల్లా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రి ప్రసంగం.. ఆయన మాటల్లోనే..

''డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ కింద జిల్లాలో ఇప్పటి వరకు 13,49,228 రైతు కుటుంబాలకు రూ.1,450.68 కోట్ల లబ్ధి చేకూరింది. ఇన్‌పుట్ సబ్సిడీ కింద పంట నష్టపోయిన 14,507 మంది రైతులకు రూ.11.51 కోట్ల పరిహారం అందించాం. ఉచిత పంటల బీమా పథకం ద్వారా 5,96,035 మంది రైతులకు రూ.565.27 కోట్లు ఖాతాల్లో జమ చేశాం. వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద రూ.15.14 కోట్లతో 137 ట్రాక్టర్లు, 448 పనిముట్లు, 234 సీహెచ్‌సీ గ్రూపులకు అందించేందుకు రూ.5.48 కోట్ల సబ్సిడీ ఇచ్చాం. సున్నా వడ్డీ కింద 1,29,198 మంది రైతులకు రూ.25.43 కోట్ల పంట రుణాలిచ్చాం. జిల్లాలో 1,35,568 వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు రూ.771.33 కోట్లతో రోజూ తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నాం.



భరతమాత వేషధారణలో విద్యార్థిని

'నాడు – నేడు'తో సత్ఫలితాలు

మన బడి, నాడు–నేడు కార్యక్రమం కింద కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు 596 ప్రభుత్వ పాఠశాలలకు రూ.147.71 కోట్లు మంజూరు చేశాం. రెండో దశ 'నాడు–నేడు' కార్యక్రమంలో 1,102 పాఠశాలలను అభివృద్ధి చేసి మౌలిక సదుపాయాల కల్పనకు రూ.100.56 కోట్లు కేటాయించాం. అమ్మఒడి కార్యక్రమం ద్వారా ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలోని 1,60,397 మంది తల్లులకు రూ.208.50 కోట్లు అందించారు.

పేదలందరికీ ఇళ్లు

పేదలందరికీ ఇళ్లు పథకం కింద జిల్లాలో 41,940 ఇళ్ల నిర్మాణానికి రూ.754.92 కోట్లు కేటాయించాం. అందులో 171 లేఅవుట్లలో 23,609 ఇళ్లు, సొంత స్థలాల్లో 18,331 నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇందుకోసం రూ.298.11 కోట్లు ఖర్చుచేశాం.

సచివాలయ వ్యవస్థ భేష్

జిల్లాలో 420 గ్రామ, 124 వార్డు సచివాలయాల ద్వారా 16,20,904 మందికి సేవలందుకున్నారు. రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న 4,029 మంది సచివాలయ ఉద్యోగులు ప్రొబేషన్ డిక్లేర్ చేశాం.

శాశ్వత భూహక్కు

రూ.1,000 కోట్ల వ్యయంతో రీసర్వే చేపట్టాం జిల్లాలో 60 గ్రామాల్లో ఫైనల్ ఆర్.ఓ.ఆర్ పూర్తి అయ్యింది. 64 గ్రామాల్లో 13వ నోటిఫికేషన్ జారీ చేశాం. వైఎస్సార్ ఆరోగ్య శ్రీలో 3,257 వ్యాధులకు ఉచిత వైద్య సేవలను ప్రభుత్వం అందిస్తోంది.

మెగా పరిశ్రమలు

జిల్లాలో ఇప్పటివరకు 48 భారీ, మెగా పరిశ్రమలు రూ.16,456 కోట్లతో స్థాపించాం. ఈ ఏడాది జూలై నాటికి 83 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను రూ.24.75 కోట్లు వెచ్చించాం. రూ.1,320 కోట్లతో 2,985 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఏర్పాటు చేసి 33,905 మందికి ఉపాధి కల్పిస్తున్నాం.

త్యాగధనుల పోరాట ఫలితమే..

సమరయోధుల పోరాట బలం, అమరవీరుల త్యాగఫలం, బ్రిటీష్ పాలకులపై తిరుగులేని విజయం.. మన స్వాతంత్య్ర దినోత్సవం. భారతావని సంకెళ్లు తెంచుకొని నేటికి 76 ఏళ్లు పూర్తి చేసుకొని, 77వ పడిలోకి అడుగిడుతున్న శుభవేళ జిల్లా ప్రజానీకానికి శుభాకాంక్షలు''అంటూ మంత్రి గుమ్మనూరు జయరాం ప్రసంగం ముగించారు.

ప్రసంగంలోని మరిన్ని అంశాలు

- ✓ జగనన్న టౌన్ షిప్ ప్రాజెక్ట్ కింద ధర్మవరం, కోడూరు, పెనుకొండ, మడకశిర పట్టణాల్లో లేఅవుట్ అభివృద్ధి పనులకు రూ.86.79 కోట్లు మంజూరయ్యాయి.
- ✓ జగనన్న సురక్ష కార్యక్రమం కింద 4,92,698 సర్వీస్ రిక్వెస్టులు రాగా, 4,88,135 అర్జీలను అధికారులు పరిష్కరించారు.
- ✓ జగనన్న గోరుముద్దలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం, శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సంయుక్తంగా రాష్ట్ర వ్యాప్తంగా 44,392 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలోని 37,63,698 మంది విద్యార్థులకు రాగిజావ అందిస్తోంది.
- ✓ వైఎస్సార్ పింఛన్ కానుక కింద ఆర్థిక సంవత్సరంలో జూలై నాటికి 2,62,022 మంది లబ్ధిదారులకు రూ.218.89 కోట్లు అందించారు.
- ✓ మహిళా శిశు సంక్షేమంలో భాగంగా 2,824 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ ఏడాది 1,43,094 మందికి పౌష్టికాహారం అందించారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద 29,642 మంది గర్భిణులు, బాలింతలు టేక్ హోం రేషన్ పొందుతున్నారు.
- ✓ అమృత్ పథకం క్రింద రక్షిత మంచినీటి సరఫరా మెరుగుపరిచేందుకు హిందూపురం, ధర్మవరం, పుట్టపర్తి, మడకశిర పట్టణాల్లో రూ.485.74 కోట్లతో పనులను చేపడుతున్నాం.



స్వాతంత్య్ర వేడుకల్లో పాల్గొన్న ఎంపీ మాధవ్, ఎమ్మెల్యేలు శ్రీధర్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, శంకరనారాయణ

వేడుక సాగిందిలా...

పుట్టపర్తి టౌన్: జిల్లా ఆవిర్భావం తర్వాత మంగళవారం రెండోసారి నిర్వహించిన స్వాతంత్య్ర దిన వేడుకలు శిరసాని హిల్స్ పోలీసు పరేడ్ మైదానంలో వైభవంగా జరిగాయి. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం ముఖ్య అతిథిగా విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

- వేడుకలకు పరేడ్ గ్రౌండ్‌ను అత్యంత సుందరంగా ముస్తాబు చేశారు. చుట్టూ జాతీయ జెండాలు ఏర్పాటు చేసి జాతీయ నాయకుల చిత్రపటాలు ప్రదర్శించారు.
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డిలతో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం తన సందేశాన్ని వినిపించారు.
- పోలీసులు, ఎన్‌సీసీ కేడెట్లతో పాటు వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు జాగిలం మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి వందనం చేసింది.
- జిల్లా ప్రగతిని తెలుపుతూ వివిధ శాఖల ఆధ్వర్యంలో రూపొందించిన ప్రగతి రథాలు (శకటాలు) ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.
- వివిధ పాఠశాల విద్యార్థులు దేశభక్తి, గ్రామీణ ప్రాంతాల వైవిధ్యం, శైలి ఉట్టిపడేవిధంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.
- అనంతరం ఉత్తమ సేవా పురస్కారాలకు ఎంపికైన అధికారులకు ప్రశంసా పత్రాలు అందించారు.
- వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్, ప్రగతి రథాల్లో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి మంత్రి గుమ్మనూరు జయరాం చేతుల మీదుగా బహుమతులు అందించారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకూ బహుమతులు అందజేశారు. వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రి, కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. జాతీయ గీతంతో వేడుకలు ముగిశాయి.

శ్రావణం.. ఆధ్యాత్మిక వైభవం







మురడి, నేమకల్లు, కసాపురం ఆంజనేయస్వామి దేవాలయాలు


- రేపటి నుంచి శ్రావణ మాసం ప్రారంభం
- ముస్తాబైన హనుమద్ క్షేత్రాలు
- ప్రత్యేక ఏర్పాట్లలో దేవదాయ శాఖ

రాయదుర్గం: శ్రావణం.. ఆధ్యాత్మిక మాసం. భగవన్నామ స్మరణతో తెలుగు లోగిళ్లు మార్మోగుతాయి. ఇంతటి పవిత్రమైన మాసం కావడంతో భక్తులు కఠోర నియమ, నిష్టలు పాటిస్తారు. గురువారం నుంచి ప్రారంభమయ్యే శ్రావణంలో నాగ పంచమి, రాఖీ పౌర్ణమి, వరలక్ష్మీ వ్రతం, మంగళగౌరీ వ్రతం, శ్రీకృష్ణ జన్మాష్టమి, పొలాల అమావాస్య పండుగలు వస్తాయి. దీంతో ఇళ్లు ఆలయాలను తలపిస్తాయి. భక్తుల కొంగుబంగారమైన అంజన్నను ఈ మాసంలో భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుంటారు. వ్యాసరాయలు కాలంలో ఒకే గడియలో మురడి (డి.హీరేహాళ్ మండలం), నేమకల్లు (బొమ్మనహాళ్ మండలం), కసాపురం (గుంతకల్లు మండలం)లో ప్రతిష్ఠించిన ఆంజనేయస్వామి విగ్రహాలు మహిమాన్వితమైనవని భక్తులు చెప్పుకుంటారు. శ్రావణంలో ఈ మూడు ఆలయాలను ఒకే రోజులో దర్శించుకుంటే పుణ్యం లభిస్తుందనేది నమ్మకం. అందుకే ఈ ఆలయాలను దర్శించుకునేందుకు ఏపీతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారు.

ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

శ్రావణంలో మూడు ఆంజనేయస్వామి (మురడి, నేమకల్లు, కసాపురం) ఆలయాలను భక్తులు దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ మాసంలో ప్రతి శని, మంగళవారాల్లో భక్తుల సౌకర్యార్థం 'హనుమాన్ దర్శన్' పేరుతో ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతోంది. జిల్లాలో ఏడు ఆర్టీసీ డిపోల పరిధిలో ఈ నెల 19 నుంచి సెప్టెంబర్ 12 వరకు 100–120 ప్రత్యేక బస్సులు నడిపేలా ప్రణాళిక సిద్ధం చేసింది.


టిక్కెట్ ధరలు ఖరారు చేశాం



మురడి, నేమకల్లు, కసాపురం ఆంజనేయస్వామి ఆలయాల సందర్శన కోసం 'హనుమాన్ దర్శన్' పేరుతో నడిపే బస్సులకు డిపోల వారీగా రాను, పోను టిక్కెట్ ధరలను ఖరారు చేశాం. అనంతపురం డిపో నుంచి పెద్దలకు రూ.450, పిల్లలకు రూ.225, గుత్తి నుంచి పెద్దలకు రూ.425, పిల్లలకు రూ.215, గుంతకల్లు నుంచి పెద్దలకు రూ.438, పిల్లలకు రూ.220గా నిర్ణయించాం. రాయదుర్గం నుంచి పెద్దలకు రూ.388, పిల్లలకు రూ.195, తాడిపత్రి నుంచి పెద్దలకు రూ.538, పిల్లలకు రూ.270, ఉరవకొండ నుంచి పెద్దలకు రూ.388, పిల్లలకు రూ.195 చొప్పున చార్జీ వసూలు చేస్తాం.

– రమేష్, ఇన్‌చార్జ్ డీపీటీఓ, అనంతపురం

ఆలయాల్లో ప్రత్యేక సౌకర్యాలు



ఈ శ్రావణమాసంలో మురడి, నేమకల్లు, కసాపురం ఆంజనేయస్వామి పుణ్యక్షేత్రాలకు భక్తుల సంఖ్య అధికంగానే ఉండవచ్చని భావిస్తున్నాం. అందుకు తగ్గట్టుగానే ఆలయాల వద్ద బారికేడ్లు, పందిర్లు, వాహనాల పార్కింగ్, శని, మంగళవారాల్లో అన్నదానం లాంటి కార్యక్రమాలు చేపట్టాం. భక్తులకు ఏ అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు వహిస్తున్నాం. స్వామి సేవకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చేవారిని వలంటీర్లగా నియమించి సేవలు అందేలా కృషి చేస్తాం.

– నరసింహారెడ్డి, ఈఓ, రాయదుర్గం

త్వరలో నిజాలు నిగ్గు తేలుస్తాం

- శ్యామల కేసుపై ఎస్పీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: కళ్యాణదుర్గం మండలం ఈస్ట్‌కోడిపల్లికి చెందిన శ్యామల కేసుకు సంబంధించి త్వరలోనే నిజాలు నిగ్గు తేలుస్తామని ఎస్పీ శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన మంగళవారం ఎస్పీ కార్యాలయ ఆవరణంలోని కాన్ఫరెన్స్ హాలులో మీడియాకు వెల్లడించారు. ఈ నెల 10న ఈస్ట్ కోడిపల్లిలో ఓ ఇంట్లో మహిళ, మరో వ్యక్తి కలసి ఉండగా స్థానికులు తలుపులకు తాళం వేసినట్లు కళ్యాణదుర్గం రూరల్ పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారమందింది. పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని తాళం తీసి ఇంట్లో ఉన్న శ్యామల, బోయ హరిలను బయటకు తీసుకు వచ్చారు. స్థానికుల సమక్షంలో విచారణ చేపట్టారు. బోయ హరితో పాటు ఇంట్లో ఉన్న మహిళ చేష్టలు మంచివి కావని స్థానికులు తెలిపారు. వీరిలాగే కొనసాగితే ఎవరైనా ఆమెకు హాని తలపెట్టే అవకాశం ఉందని భావించి తాము ఆ ఇంటికి తాళం వేశామని ఎస్ఐ సుధాకర్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రాథమికంగా అన్ని కోణాల్లో ఆరా తీసిన ఎస్ఐ అప్పటికే రాత్రి కావడంతో ఇద్దరినీ వారి కుటుంబ సభ్యులకు అప్పగించి, ఉదయాన్నే స్టేషన్‌కు రావాలని సూచించి వెళ్లిపోయారు. 11న ఉదయం శ్యామల పోలీసు స్టేషన్‌కు వెళ్లి ముందు రోజు జరిగిన దానికి భిన్నంగా ఫిర్యాదు చేసింది. బోయ హరి తనను మూడు నెలలుగా వేధిస్తున్నాడని, లొంగదీసుకునే ప్రయత్నం చేస్తున్నాడని అందులో పేర్కొంది. విచారణ చేసి చర్యలు తీసుకోవాలని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయింది. 14న ఎస్పీ కార్యాలయంలో జరిగిన 'పోలీస్ స్పందన'కు ప్రజా సంఘాల నాయకులతో కలసి వచ్చిన శ్యామల తనను ఏడాది కిందట ఐదుగురు సామూహిక అత్యాచారం చేసినట్లు ఫిర్యాదు చేసింది. మీడియా ముందు ఇదే విషయాన్ని వెల్లడించింది. సదరు మహిళకు న్యాయం చేయడం కోసం ముందుగా కేసు నమోదు చేశామని ఎస్పీ తెలిపారు. తదుపరి చట్టపరమైన చర్యలలో భాగంగా విచారణ చేపట్టామన్నారు. శ్యామలకు ఎలాంటి ఇబ్బందులున్నా చట్టపరిధిలో పోలీసులు చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కిందిస్థాయి పోలీసులు ఈ కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించి ఉంటే చర్యలు తీసుకోవాలని డీఎస్పీ శ్రీనివాసులును ఎస్పీ ఆదేశించారు. శ్యామల ఫిర్యాదుపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు చేశారు. సమావేశంలో ఏఎస్పీ విజయభాస్కరరెడ్డి, కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులులు పాల్గొన్నారు.


మొదటి స్థానం దక్కించుకున్న డీఆర్‌డీఏ శకటం


రెండో స్థానంలో నిలిచిన వ్యవసాయ శకటం


మూడో స్థానం దక్కించుకున్న హౌసింగ్ శకటం


హుస్సేన్ పీరా, డీఎస్పీ, పెనుకొండ


విజయకుమార్, డీఎస్పీ, ఏఆర్


మీనాక్షి, డీఈఓ | ఉదయ్‌భాస్కర్, చీఫ్ కోచ్


సంజీవయ్య ఆర్‌అండ్‌బీ ఇంజినీర్ | వేణాయుధం ఐఅండ్‌పీఆర్ ఏడీ

ఉత్తమ సేవలకు ప్రశంస


లక్ష్మీకుమారి ఐసీడీఎస్ పీడీ | చంద్రమౌళి హౌసింగ్ పీడీ | చాంద్‌బాషా పరిశ్రమల శాఖ | కృష్ణయ్య ఆయుష్ | బాలసుబ్రమణ్యం రెడ్డి, సీఐ, పుట్టపర్తి


రషీద్‌ఖాన్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి | మోజెస్ విద్యుత్ శాఖాధికారి


కరుణసాగర్‌రెడ్డి డీపీటీఓ | నాగేశ్వర్‌రెడ్డి టూరిజం శాఖ | రామకృష్ణ, ఏడీ సర్వే అండ్ ల్యాండ్స్ | శుభదాస్ పశు సంవర్ధకశాఖ | రవీంద్రనాథ్‌రెడ్డి, సీఐ, ఎస్‌బీ


హేమంత్‌రెడ్డి అగ్నిమాపక శాఖాధికారి | గోపాల్‌రెడ్డి, ఎస్‌ఈ పంచాయతీరాజ్


పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం (చిత్రంలో) కలెక్టర్ అరుణ్‌కుమార్, ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పుట్టపర్తిలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన వేడుకలు అంబరాన్ని అంటాయి. మెరుగైన పనితీరుతో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించిన వివిధ శాఖలకు చెందిన 416 మంది ఉద్యోగులకు ఉత్తమ అవార్డులను జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుమ్మనూరు జయరాం ప్రదానం చేశారు. అంతకు ముందు సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తూ జ్ఞాపికలు అందజేశారు. వివిధ శాఖల ప్రగతిని చాటుతూ ప్రదర్శించిన 11 శకటాల్లో డీఆర్‌డీఏ, వ్యవసాయ, హౌసింగ్ శకటాలు తొలి మూడు స్థానాలను దక్కించుకుని, బహుమతులను కైవసం చేసుకున్నాయి. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి జయరాం పరిశీలించారు. వైద్య శాఖ ఏర్పాటు చేసిన స్టాల్ ప్రథమ స్థానంలో నిలిచింది. కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


కొండయ్య డీఆర్‌ఓ | భాగ్యరేఖ పుట్టపర్తి ఆర్‌డీఓ | వైవీ సుబ్బారావు డీపీఓ | చంద్రశేఖర్, ఉద్యాన శాఖాధికారి | సుదర్శన్, ఏపీఎంఐపీ పీడీ | కిశోర్‌రెడ్డి, కాలుష్య నియంత్రణ శాఖాధికారి | మంజువాణి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ


శివారెడ్డి నోడల్ ఆఫీసర్ | రవీంద్రనాథ్‌రెడ్డి అటవీ శాఖాధికారి | లక్ష్మానాయక్ ప్రకృతి సేద్యం | సురేష్, కలెక్టరేట్ సీసీ | రాజశేఖర్, కలెక్టరేట్ సీసీ | రఘురామనాయక్, జూనియర్ అసిస్టెంట్ | అనిల్‌కుమార్, సబ్‌కలెక్టర్ సీసీ


పద్మమ్మ, జేడీ సెరికల్చర్ | పి.రాజశేఖర్‌రెడ్డి భూగర్భ జలశాఖ | వంశీకృష్ణారెడ్డి, డీఎం పౌరసరఫరాల శాఖ | ఎస్‌వీ కృష్ణారెడ్డి డీఎంహెచ్‌ఓ | తిప్పేంద్రనాయక్ డీసీహెచ్‌ఎస్ | బండి శేషన్న మున్సిపల్ కమిషనర్ | శివశంకర్, ఎంపీవో


రామాంజినేయులు, డ్వామా పీడీ | లలితా, ఏపీఎం, డీఆర్‌డీఏ | వినోద్ కుమార్, ఆర్‌ఐ, కలెక్టరేట్ | రామాంజులరెడ్డి, తహసీల్దార్,కొత్తచెరువు | యుగేశ్వరి దేవి, తహసీల్దార్,బత్తలపల్లి | సురేష్‌కుమార్, తహసీల్దార్,సోమందేపల్లి | నటరాజ్, తహసీల్దార్, కదిరి


సతీష్ కుమార్, సీఐ డీసీఆర్‌బీ, పుట్టపర్తి | సుబ్రమణ్యం, సీఐ, ధర్మవరం | సుబ్బారావు, సీఐ డీసీఆర్‌బి | టైటాస్, ఆర్‌ఐ పుట్టపర్తి | సుబ్బరాయుడు, సీఐ, గోరంట్ల | సూర్యనారాయణ, సీఐ, కదిరి(యు) | శివశంకర్ నాయక్, సీఐ, కదిరి రూరల్


డీపీఓ విజయ్‌కుమార్ | డీఆర్‌డీఏ పీడీ నరసయ్య | ఎస్సీ వెల్ఫేర్ అధికారి శివరంగప్రసాద్ | ఎస్టీ వెల్ఫేర్ అధికారి మోహన్‌రామ్ | బీసీ వెల్ఫేర్ అధికారి నిర్మలజ్యోతి | మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ | జయశ్రీ, ఎంపీవో


జనార్దన్ నాయుడు, ఎస్‌ఐ, రామగిరి | నరేంద్ర, ఎస్‌ఐ, పరిగి | మునీర్ అహ్మద్, ఎస్‌ఐ, లేపాక్షి | వెంకటేశ్వర్‌రావు, ఆర్‌ఎస్‌ఐ | శ్రీధర్, ఇన్‌స్పెక్టర్ సెబ్ | కెఎం.లింగన్న, ఎస్‌ఐ, కొత్తచెరువు | మక్బూల్ బాషా, ఎస్‌ఐ, తలుపుల

త్యాగధనుల మార్గం అనుసరణీయం

- గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యం
- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం


పార్టీ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న మంత్రి గుమ్మనూరు, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధరరెడ్డి

పుట్టపర్తి టౌన్: దేశానికి స్వాతంత్య్రం సాధించేందుకు పాటుపడిన త్యాగధనుల మార్గం అనుసరణీయమని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సీఎం జగన్‌తోనే సాధ్యమైందని కొనియాడారు. 77వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి జయరాంతో పాటు ఎంపీ గోరంట్ల మాధవ్, స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధరరెడ్డి హాజరయ్యారు. జాతీయ పతాకాన్ని ఎగురవేసి, స్వాతంత్య్ర సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. త్యాగధనుల ఆశయ సాధనలో భాగస్వాములు కావాలని యువతకు పిలుపునిచ్చారు. త్యాగధనుల స్ఫూర్తితో గాంధీజీ కలలుగన్న స్వరాజ్యాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సిద్ధింపజేశారన్నారు. సీఎం వైఎస్ జగన్ నాయకత్వంలో రాష్ట్రంలో సరికొత్త అధ్యయనం మొదలైందన్నారు. సమృద్ధిగా వర్షాలు కురిసి, ఎటు చూసినా పాడి పంటలతో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు ఇంటి వద్దనే అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తంగా ఓబుళపతి, వైస్ చైర్మన్లు శ్రీలక్ష్మి, తిప్పన్న, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రమణారెడ్డి, మెప్మా అధ్యక్షురాలు సాయిగీత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు రంగారెడ్డి, నరసారెడ్డి, నెడ్‌క్యాప్ మాజీ డైరెక్టర్ మాధవరెడ్డి, సహకారసంఘం అధ్యక్షుడు రుషీకేశవరెడ్డి, కౌన్సిలర్లు సూర్యాగౌడ్, సాయిగీత, చెరువుభాస్కరరెడ్డి మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, ఫొటోసాయి, మండల మాజీ కన్వీనర్ గంగాద్రి, నాయకులు కవిత, కుమారి, సుధాకర్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, మలిరెడ్డి, కోగిర సువర్ణ, బిల్డర్ మల్లికార్జునతో పాటు పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగం వృథా కాదు

- ఎస్పీ మాధవరెడ్డి


జాతీయ పతాకం ఎగురవేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: దేశ స్వాతంత్య్రం కోసం పోరాడిన అమరుల త్యాగాలు ఎన్నటికీ వృథా కావని ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఎగురు వేసి, మాట్లాడారు. స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను గుర్తు చేశారు. అలాగే డీపీటీఓ కార్యాలయంలో జిల్లా ప్రజారవాణాధికారి మధుసూదన్, రైల్వేస్టేషన్‌లో మేనేజర్ సతీష్‌రెడ్డి, విద్యుత్ కార్యాలయంలో ఏడీఏ శరవణన్, ఫైర్ స్టేషన్‌లో అధికారి హేమంత్‌రెడ్డి జాతీయ పతకాలను ఎగురువేసి, గౌరవ వందనం సమర్పించారు.

రైల్వే డివిజన్ అభివృద్ధికి తోడ్పడాలి

- డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్


గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్


ఉద్యోగికి ప్రశంసాపత్రం అందజేస్తున్న జీఆర్‌పీ ఎస్పీ చౌడేశ్వరి

గుంతకల్లు: ఉద్యోగులు సవాళ్లను అధిగమించి గుంతకల్లు రైల్వే డివిజన్‌ను అభివృద్ధి పథంలో నడిపించేందుకు తోడ్పడాలని డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్ సూచించారు. మంగళవారం స్థానిక రైల్వే క్రీడా మైదానంలో 77వ స్వాతంత్య్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. డీఆర్‌ఎం జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం చేశారు. రైల్వే రక్షక దళాలు, స్కౌట్స్ అండ్ గైడ్స్ కేడెట్ల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సందేశాన్ని చదివి వినిపించారు. ప్రస్తుత ఏడాది గుంతకల్లు డివిజన్ అన్ని రంగాల్లో అద్భుతమైన పనితీరును చూపుతూ ముందంజలో ఉందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించడానికి ప్రతి ఉద్యోగి కలసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రైల్వే స్కూల్, చందమామ స్కూల్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గుంతకల్లులోని జీఆర్‌పీ ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ చౌడేశ్వరి, నక్కనదొడ్డి సమీపంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ డిపోలో సీనియర్ మేనేజర్ దాస్ ప్రసాద్ జెండా ఆవిష్కరించారు.